క్లుప్తంగా

అంకమ్మ తల్లి ఆలయ మండపం ప్రారంభం

చీమకుర్తి: స్థానిక ఇసుకవాగు సెంటర్‌లో నూతనంగా నిర్మించిన అంకమ్మతల్లి ఆలయ మండపాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. అంకమ్మతల్లి మండపం నిర్మాణానికి మారం వెంకారెడ్డి ఆర్థిక సాయం అందించారు. కోటా రాములు, వీ.నరసింహారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఏ విద్యార్థి అదృశ్యం

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్యవైశ్య హాస్టల్‌లలో ఉంటూ సీఏ చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. బాపట్ల జిల్లా యుద్దనపూడి మండలం వింజనం పాడు గ్రామానికి చెందిన దార సాయి (28) ఒంగోలులోని శర్మ కళాశాల సమీపంలోని ఆర్యవైశ్య బాలుర హాస్టల్లో ఉంటూ సీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వూరికి వెళ్లి మూడు రోజుల్లో వస్తాను అని హాస్టల్ మేనేజర్‌తో చెప్పి ఈ నెల 1న బయటకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు రాలేదు. అదే రోజు ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్ళిన సాయి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కడే ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

అదుపు తప్పిన కారు



షాపును ఢీకొట్టిన కారు

ఒంగోలు టౌన్: భాగ్యనగర్‌లో గల రిజిస్టర్ కార్యాలయం వద్ద ఓ కారు రివర్స్ అవుతూ అదుపుతప్పి సమీపంలోని దుకాణాన్ని ఢీకొంది. కారు వెనుక భాగం కూడా దెబ్బతింది. అక్కడ ఉన్న ఓ వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి.

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కల్యాణానికి ఉభయదాతలు కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కెశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దర్శి: చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు జరగవని సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ ప్రసాద్ సూచించారు. స్థానిక సబ్ జైలు, ఎస్సీ బాలికల వసతి గృహాలను శనివారం ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. వారి భోజన వసతి, మెనూను పరిశీలించి భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఖైదీలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ కావాలని నేరాలు చేసి జైలుకి రారని, క్షణకాలిక ఆవేశంలో చేసిన తప్పులకు జైలుకు రావాల్సి వస్తుందని తెలిపారు. బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సమస్యలు ఏమైనా ఉన్నాయా అని జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉంటే జీవితంలో తప్పులు చేయకుండా ఉంటారని ఆమె పేర్కొన్నారు. న్యాయవాదులు మనోహరమ్మ, సుబ్బారెడ్డి, జైలు సూపరింటెండెంట్ వెంకట రమణ ఉన్నారు.

చట్టాలపై డ్రైవర్లకు అవగాహన తప్పనిసరి

మార్కాపురం: మోటార్ వెహికల్ చట్టాలపై ప్రతి డ్రైవర్ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజావెంకటాద్రి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవర్లు వాహనాలు నడపాలని, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. డ్రైవర్లు తమతో పాటు వాహనంలో ఉన్న వారి ప్రాణాల బాధ్యత కూడా తమదేనన్న భావన కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేని వారికి వెంటనే లైసెన్స్ ఇవ్వాలని మోటార్ వెహికల్ ఆఫీసర్‌ను రాజావెంకటాద్రి ఆదేశించారు. జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, ఆర్‌టీఓ అమర్‌నాయక్ మాట్లాడారు. ఎంవీఐ మాధవరావు, పట్టణ ఎస్‌ఐ శశికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంది నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే ఖాశిం పాల్గొన్నారు.

మిర్చికి దళారి దెబ్బ



గోతాలకు నింపుతున్న పచ్చి మిర్చి



సాగు చేస్తున్న పచ్చి మిర్చి పైరు

- భారీగా పడిపోయిన పచ్చి మిర్చి ధర
- ఆందోళనలో రైతులు

కొత్తపట్నం: పచ్చి మిర్చి ధర దిగజారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు దళారులు సిండికేట్ అయి అన్నదాత నడ్డి విరుస్తున్నారు. కొత్తపట్నం, చిన్నగంజాం, చీరాల, పాకల, వేటపాలెం, రాచర్ల, గిద్దలూరులో ఎక్కువగా పచ్చిమిర్చి సాగు చేస్తారు. ఇసుక నేలలు పచ్చిమిర్చి అనుకూలంగా ఉంటుంది. సుమారు 2 వేల నుంచి 3 వేల ఎకరాలు సాగు చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే సారి ఉత్పత్తి కావడం వల్ల ధర తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. పచ్చిమిర్చి నిల్వ చేసుకోవడానికి వసతులు లేకపోవడం కూడా మరో కారణంగా నిలిచింది. మాండూస్ తుఫాన్ వల్ల పంట కొంత దెబ్బతింది.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

పచ్చిమిర్చి తెలంగాణ, మహారాష్ట్ర, బెంగళూరు, చెన్నైలకు ఎగుమతి చేస్తారు. ఇప్పుడు దూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారస్తులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా నుంచి ప్రతి రోజూ వెయ్యి టన్నుల పచ్చిమిర్చి ఎగుమతి అవుతున్నట్లు సమాచారం. రెండేళ్లుగా క్వింటా ధర రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు పలికింది. దీంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు సాగుబడి చేశారు. ఎకరాకి దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నీరు పెట్టేవాడికి జీతం కలుపుకుని రూ.1.40 లక్షల నుంచి రూ.1.60 లక్షలు ఖర్చు అవుతుంది. ఎకరానికి 2 టన్నుల నుంచి రెండున్నర టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఒక టన్ను ధర రూ.50 వేలు నుంచి రూ. 55 వేలు పలుకుతుంది. కాగా ఎకరాకి రూ. 30 వేలు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. క్వింటా మిర్చి కోత కూలీ రూ. 600 ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా భారీగా నష్టం రావడంతో కొంత మంది రైతులు ఎండబెట్టి దుక్కి దున్నుతున్నారు. గిడ్డంగి సౌకర్యాలు ఏర్పాటు చేసి.. ధర తక్కువ ఉన్నప్పుడు నిల్వ చేసుకుని ఎక్కువ ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుకుంటున్నారు.

రూ.1.20 లక్షలు ఖర్చు పెడితే రూ.50 వేలు వచ్చింది



ఈ ఏడాది ఒక ఎకరాలో పచ్చిమిర్చి సాగుబడి చేశాను. ఎకరాకు రూ.1.20 లక్షలు ఖర్చు చేశా. ఇప్పటికి రూ.50 వేలకు మిర్చి కోశా. ఇంకా రూ.70 వేలు రావాల్సి ఉంది. ఇప్పటికే సగం సీజన్ అయిపోయింది.

– గడ్డం అమృతపాణి ఈతముక్కల

ఇంత తగ్గుతుందని ఊహించ లేదు



నేను రెండు ఎకరాలు సాగుబడి చేస్తున్నా. ఊహించని రీతిలో ధర తగ్గిపోయింది. వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర తగ్గించారు.

– ఉప్పాల వెంకట్రావు: రాజుపాలెం

ధర పెరిగే అవకాశం ఉంది:

దిగుబడులు ఒకేసారి రావడం వలన ధర తగ్గింది. ఇప్పుడిప్పుడే ధర పెరుగుతుంది. పచ్చి మిర్చి ఏ రోజుకు ఆరోజు కోయాలి. జిల్లాలో కొత్తపట్నం, గిద్దలూరు, రాచర్ల, కొత్తపట్నం మండలాల్లో పచ్చి మిర్చి పండించారు.

– శ్రీలక్ష్మి
డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్,

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న నిర్వహించనున్న ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు వేయాలని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి విజ్ఞప్తి చేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గోగినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామలక్ష్మి మృతి సాహితీ రంగానికి తీరని లోటు



కథాచయిత్రి రామలక్ష్మి మృతికి సంతాపం తెలుపుతున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: ప్రముఖ కవి ఆరుద్ర సతీమణి, స్త్రీవాద రచయిత్రి కె.రామలక్ష్మీ మృతి సాహితీ రంగానికి తీరని లోటని మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని సమితి కార్యాలయంలో శనివారం జరిగిన రామలక్ష్మి సంతాప సభలో మాట్లాడారు. స్త్రీ స్వేచ్ఛ, మహిళల హక్కుల మీద రామలక్ష్మి అనేక రచనలు చేశారని కొనియాడారు. కుటుంబ జీవితంలో దోపిడీకి గురౌతున్న మహిళల శ్రమ శక్తిని రామలక్ష్మి సమర్థవంతంగా ఆవిష్కరించారని నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి చెప్పారు. శతాధిక రచనలు చేసిన ఆమె జీవనజ్యోతి సినిమాకు అందించిన కథకు రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్ఠాత్మక నంది అవార్డును అందుకున్నారని, అనేక పురస్కారాలు అందుకున్నారన్నారు. కత్తి కృపావరం, మారేపల్లి సూర్య కుమారి, బీరం అరుణ, డాక్టర్ నూనె అంకమ రావు, కుర్రా ప్రసాద్‌బాబు, మిడసల మల్లికార్జున రావు పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవం రేపు

నాగులుప్పలపాడు: ఎస్సీ వర్గీకరణ కోసం త్యాగం చేసిన అమరవీరుల దినోత్సవాన్ని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఒంగోలులో జరుగుతుది. రాష్ట్ర నాయకులు కొమ్మూరి గరటయ్య మాదిగ, మండల అధ్యక్షుడు మల్లెల ప్రసాద్ కోరారు. ఈ మేరకు ప్రకటనలో తెలిపారు.

గృహ నిర్మాణదారులకు ఆర్థిక సాయం



కరవదిలో చెక్‌లను అందజేస్తున్న ఎంపీడీవో, తదితరులు

ఒంగోలు రూరల్: కరవది 5 లే అవుట్‌లో గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని అందించారు. ఒక్కొరికి రూ.10,000 నుంచి రూ.50,000 వరకు తక్షణ ఆర్థిక ప్రకారం మొత్తం రూ.5 లక్షలు కరవదిలో పంపిణీ చేశారు. హౌసింగ్ ఏఈ పృధ్వీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి, ఏఈపీఆర్ శేషగిరి, ఏపీఎం గోపీనాథ్ పాల్గొన్నారు

ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం



సంతనూతలపాడులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి, పి.చంద్రశేఖరెడ్డిని గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలో శనివారం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అభ్యర్థుల ప్రతినిధులు ఎం.మనోజ్‌కుమార్, మస్తాన్‌వలి, హుస్సేన్, కత్తినేని శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే రహంతుల్లా, గౌసాని, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా నాగయ్య



నాగయ్యకు ఎన్నిక పత్రం అందజేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన నంబూరి నాగయ్య ఎన్నికయ్యారు. బాపట్ల జిల్లా వేటపాలెంలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి యానాది సంఘం కార్యవర్గ సమావేశంలో నాగయ్యను ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేశారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య యానాది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల ఏడుకొండలు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మేడికొండ వెంకట రమణ చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ముక్తినూతలపాడు ప్రదర్శన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పత్రాన్ని అందజేస్తున్న రాయపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు రూరల్: ముక్తినూతలపాడు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికయిన నేపథ్యంలో హెచ్‌ఎం సరస్వతికి శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రాయపాటి వెంకటేశర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన



పొలంలో విత్తనాలు వేస్తున్న సుభాషిణి

కొత్తపట్నం: ఒక ఎకరాలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న 30 రకాల జాతుల మొక్కలను శనివారం నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి పరిశీలించారు. కొత్తపట్నంలో పురిణి మల్లేశ్వరి పండిస్తున్న కూరగాయాలు, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలు, గడ్డ జాతి, తీగ జాతి, మొక్కలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 16 నుంచి 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ వేసుకుంటే 45 రోజులకి పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఏవో మోహన్‌రెడ్డి, వీఏఏలు కరిముళ్ళ శ్రీకాంత్, రెడ్డప్ప, నరసింహులు, ఐఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపట్నం: మనస్థాపం చెంది ఓ యువతి ఎలుకలు మందు తిని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. కావలి పట్టణానికి చెందిన కొడిదల సుమతి (30)ని పదేళ్ల క్రితం కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామానికి చెందిన కొడిదల మోహన్‌రావుకు ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుండి వారు కాపురం సజావుగా సాగింది. 4 నెలలు క్రితం వివాహేతర సంబంధం పెట్టుకుని ఓ వ్యక్తితో ఆదృశ్యమయింది. బంధువులు ఫోన్ కాల్ ఆధారంగా గాలించి 15 రోజులు క్రితం గ్రామానికి తీసికొచ్చారు. భర్తతో కాపురం చేసుకుని పిల్లను చూచుకోవాలని పెద్దలు ఒకటి చేశారు. ఈక్రమంలో మనస్థాపం చెంది సుమతి శుక్రవారం ఎలుకల మందు సేవించింది. కొద్ది సేపటికే స్పృహతప్పి పడిపోడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.



అక్రమంగా నిర్మిస్తున్న భవనం

అక్రమ లే అవుట్లు, కట్టడాలపై చర్యలు

- అనుమతి లేని లే అవుట్ల యజమానులకు నోటీసులు జారీ
- నగరంలో పర్యటించిన కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు



ముక్తినూతలపాడులో పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏసీపీ వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: నగరంలో అక్రమంగా ఏర్పాటు చేసిన లే అవుట్లపై ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తొలుత శనివారం ముక్తినూతలపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా అక్రమంగా వేసిన లే అవుట్‌లను గుర్తించారు. అదేవిధంగా అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను గుర్తించి.. నిర్మాణ పనులు ఆపేసి నోటీసులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లును ఆదేశించారు. ముక్తినూతల పాడు వార్డు సచివాలయం పరిధిలో మూడు అక్రమ లే అవుట్లను గుర్తించారు. ఆ ముగ్గురికీ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. త్రోవగుంట పరిధిలో కూడా కొన్ని అక్రమ లే అవుట్లు ఉన్నట్లు గుర్తించినట్లు కమిషనర్ వివరించారు. అదేవిధంగా వెంకటేశ్వర కాలనీలోని అయ్యప్ప లే అవుట్‌ను కూడా సందర్శించారు. దాంతో పాటు శ్రీరాం గార్డెన్ సిటీ లే అవుట్‌తో పాటు మరో మూడు లే అవుట్లు కూడా అక్రమంగా వేశారని గుర్తించారు. వాళ్ళకు కూడా వెంటనే నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీని ఆదేశించారు. అదేవిధంగా కొప్పోలులోని మరో రెండు అక్రమ లే అవుట్లు కూడా ఉన్నాయని అందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో అనుమతులు లేకుండా అక్రమ లే అవుట్లు వేస్తే సహించేది లేదన్నారు. అందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని వెల్లడించారు.

కృత్రిమ గర్భోత్పత్తితో లాభం



ప్రదర్శన ప్రారంభిస్తున్న సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబీరాణి

మద్దిపాడు: కృత్రిమ గర్భోత్పత్తితో ఆడదూడలను పుట్టించడం వలన పాడి రైతులకు మేలు జరుగుతుందని సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబీరాణి అన్నారు. శనివారం మండలంలోని ఇనమనమెళ్లూరులో నిర్వహించిన ఆడదూడల ప్రదర్శన కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రభుత్వం పశు సంక్షేమ శాఖలో ప్రవేశ పెట్టిన పథకాల్లో పాడి రైతులకు ఉపయోగకరంగా ఉండే పథకం అందిస్తుందన్నారు. ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ దూడలలో చర్మవ్యాధుల నివారణ ఎలా చేసుకోవాలన్న అంశంపై అవగాహన కల్పించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కాలేషా, ఏడీ రామారావు, డాక్టర్ మాధవి, పశువైద్య శాల సిబ్బంది పశువైద్య సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పేస్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్థానిక పేస్ కాలేజీలో జరిగిన 15వ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ 2008లో కేవలం 240 మంది విద్యార్థులతో ఇంజినీరింగ్ కాలేజీని ప్రారంభించామన్నారు. నేడు అదే కాలేజీలో 6500 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్కిల్స్ అభివృద్ధి చేసుకుని కంపెనీలకు అనుగుణంగా టెక్నాలజీ నేర్చుకుని మంచి జీతాలతో ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. పది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు, ఉత్తమ అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి బహుమతులు అందించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఎం.రమణ బాబు, డీన్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కె.రూప అక్కేష్ పాల్గొన్నారు.